క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి తులాభారం, కల్యాణోత్సవం



కంచర వీధి ఆలయంలో తులాభారం

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి తులాభారం నిర్వహించారు. ముందుగా స్వామివారికి తులాభారం వేసి ఆ తరువాత చిన్నారులకు నిర్వహించారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



సింగిరెడ్డివలసలో పారిశుద్ధ్య పనులు

తెర్లాం: మండలంలోని ఆమిటి, సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సర్పంచ్‌లు చేపట్టారు. గ్రామాల్లోని రోడ్లుకు ఇరువైపులా, కాలువల్లోను, బోరుబావుల చుట్టూ బ్లీచింగ్, సున్నం కలిపిన పౌడర్‌ను వేశారు. పండుగ సందర్భంగా ప్రజలు చెత్తాచెదారాలను రోడ్లపై వేయవద్దని, గ్రీన్ అంబాసిడర్లు రిక్షా బండి తెచ్చినప్పుడు అందులో చెత్తను వేయాలని ఆమిటి, సింగిరెడ్డివలస గ్రామాల సర్పంచ్‌లు ప్రజలకు సూచించారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం



సంధ్య జన్మనిచ్చిన బిడ్డతో ఆశావర్కర్

వంగర: మండలంలోని పెద రాజులగుమ్మడ గ్రామానికి చెందిన గర్భిణి వావిలపల్లి సంధ్య 108 వాహనంలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆమెకు పురిటినొప్పులు రావడంతో బంధువులు 108 వాహనానికి ఫోన్ చేసి, సమాచారమిచ్చారు. గ్రామానికి వాహనంతో చేరుకున్న ఈఎంటీ రాజారావు, పైలట్ అనీల్‌కుమార్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రభుత్వాస్పత్రికి ఆమెను తరలించారు. గరుగుబిల్లి మండలంలోని గొట్టివలస దగ్గరకు వెళ్లేసరికి ఆమె ప్రసవం జరిగి, ఆడబిడ్డ పుట్టిందని సిబ్బంది తెలిపారు.


ఓటమి విజయానికి నాంది..



ఇంటర్మీడియట్ ప్రత్యేక తరగతుల ప్రారంభోత్సవంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: ఓటమి విజయానికి నాందిగా భావించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండలంలోని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కసారి పరీక్షల్లో ఫెయిలైతే బాధపడాల్సిన అవసరం లేదన్నారు. మరోసారి బాగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత పొంది సత్తా చాటాలని తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, బి.వెంకటరావు, బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



బొబ్బిలి: స్థానిక బ్రహ్మకుమారీస్ మందిరంలో నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. వారణాలసి రామలింగ స్వామి, మీనాక్షిల వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన కింతలి అనంతరావు స్వామి రగ్గులు, చీరెలను బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి అక్కయ్య సోమవారం పంపిణీ చేశారు. నిరంజన్ గుప్తా, బొత్స వెంకట రమణ,బ్రమరాంబ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి

మెంటాడ: మండల కేంద్రంలోని సంతతోటలో కొంతమంది స్థానికులు గ్రామ కంఠం భూమిని ఆక్రమణ చేసి పాకలు, షాపులు ఏర్పాటు చేసుకున్నారని, ఆక్రమణదారులందరిని తక్షణమే ఖాళీ చేయించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, మెంటాడ సర్పంచ్ రేగిడి రాంబాబు ఎంపీడీఓను కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆక్రమణలు తొలగించాలంటూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తివిక్రమ్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఈ ఫిర్యాదుపై రెవెన్యూ శాఖకు అప్పగించామని తెలిపారు.

'నవరత్నాలు'తో ప్రతిఇంటా సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలో నవరత్నాలు పేరిట వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమం నెలకొందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణ పరిధిలోని డోలపేటలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పురోగతి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయనకు మనమంతా అండగా నిలవాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చడంతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఆయన ప్రజలకు ఇచ్చిన మరెన్నో హామీలు నెరవేర్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా.. పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామాల్లోని సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయని, వీటితో పాటు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంగర కన్వీనర్ కరణం సుదర్శనరావు, నాయకులు పాలవలస గోపి, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, యాలాల వెంకటేష్, దూబ గోపాలం, శాసపు వేణుగోపాలనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడు, గోకవలస బాబూరావు, నల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈ రత్నాకర్, టీఎంసీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పెన్షన్ల పంపిణీ



రేగిడి: వన్నలిలో దివ్యాంగునికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్



రాజాం: పెన్షన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ శ్రావణీబాయి



తెర్లాంలో పెన్షనర్ రాజుతో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ గౌరీశ్వరి



మెంటాడ: కొంపంగిలో ఫించన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ జోరుగా జరుగుతోంది. సోమవారం ఉదయం నుంచే వలంటీర్లు అంతా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, పెన్షన్ల నగదు అందజేశారు. దాదాపు 85 శాతం మేర పెన్షన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ జి.కాశీ విశ్వనాథరావు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ అభినందనలు..

రాజాం: పట్టణంలోని లచ్చయ్యపేట సచివాలయం -1 పరిధిలోని మల్లిఖార్జునకాలనీకి చెందిన వలంటీర్ టి.శ్రావణీబాయి విధి నిర్వహణలో తన అంకిత భావం చాటుకున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో నామె కుడికాలు విరిగిపోగా, ఆ కాలికి ఆపరేషన్ అయింది. కాలికి కట్టు ఉన్నప్పటికీ సోమవారం తన వార్డులోని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసింది. ఈ మేరకు ఆమెను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అభినందించారు.

సంతకవిటి: మండలంలోని బొద్దూరు, తాలాడ, సంతకవిటి ప్రాంతాల్లో వైఎస్సార్ సామాజిక పెన్షన్ల పంపిణీ నిర్వహించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, బయోమెట్రిక్ ఆధారంగా లబ్ధిదారులకు పెన్షన్ల నగదు అందజేశారు. 80 శాతం మేర పెన్షన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి తెలిపారు.

పింఛన్ల పంపిణీ

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్వహించారు. మండలంలో గల వివిధ రకాల పెన్షన్‌లకు సంబంధించి పింఛనర్లకు గ్రామ వలంటీర్లు బయోమెట్రిక్ వేలిముద్రలు, ఐరిష్, ఫేషియల్ ద్వారా పింఛన్ డబ్బులను అందజేశారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో 9వేల 771మంది వివిధ రకాల పెన్షన్‌దారులు ఉండగా, మొదటి రోజు జరిగిన పెన్షన్ల పంపిణీ 93శాతం పూర్తయ్యింది. మండలంలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ పర్యవేక్షించారు.

నేడు దాడితల్లి సిరిమానోత్సవం



అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పిస్తున్న పూజారులు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు, దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. బొబ్బిలి, గొల్లపల్లితో పాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు దాడితల్లి పండుగను జరుపుకుంటారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు పూజారి బత్తిన సూరిబాబు సిరిమానును అధిరోహిస్తారు. అక్కడి నుంచి గొల్లపల్లి, మార్కెట్ మీదుగా బొబ్బిలి పురవీధుల్లో సిరిమాను ఊరేగుతుంది. తిరిగి తెల్లవారు జామున గొల్లపల్లి చేరుకుంటుంది. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సిరిమాను తిరిగే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలూ లేకుండా ఉండేలా సిబ్బందితో కలసి పర్యటించారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

దాడితల్లి అమ్మవారి పండుగలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరెలు సమర్పించారు. భక్తులు ఘటాల వెంట తిరుగుతూ సందడి చేశారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు తెలియజేస్తూ వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులను ఉద్దేశించి ఎంపీడీఓ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రతీ సోమవారం ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు వచ్చి వినతిపత్రాలు ఇవ్వొచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఏ శాఖకు చెందిన సమస్యలను ఆ శాఖ అధికారులు సకాలంలో పరిష్కరించాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తైక్వాండోలో ఉచిత శిక్షణ

బొబ్బిలి: విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్టు కోచ్ బంకురు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విజేత స్కూల్ ఆవరణలో, సురేష్ స్కూల్ ఆవరణలో జిల్లా కోచ్ సీహెచ్ వేణుగోపాలరావు నేతృత్వంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఇవ్వనున్నామన్నారు. ప్రతీ రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 వరకు, తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి 7 గంటల వరకు జరిగే శిక్షణలో పాల్గొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదేళ్ల పిల్లల నుంచి పెద్ద వయసు వరకూ ఈ శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 7780760504ను సంప్రదించాలన్నారు.

డ్యాన్స్‌లో శిక్షణ

యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు బాల బాలికలకు డ్యాన్స్‌పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెలాఖరు వరకూ సురేష్ స్కూల్ ఆవరణలో ప్రతీ రోజూ ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకూ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. సెమీ క్లాసిక్, జానపదం, సినీ గేయాలకు నృత్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9440744741 నంబరును సంప్రదించాలన్నారు.

'స్పందన' సమస్యలను పరిష్కరించాలి



వంగర: మాట్లాడుతున్న తహసీల్దార్ ఐజాక్

వంగర: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమం దృష్టికి ప్రజలు తీసుకువస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, పలువురు సమర్పించిన వినతిపత్రాలను అధికారులు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ లోపింటి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడాశిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి క్రీడాశిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ తిరుపతి

సంతకవిటి: మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవిక్రీడా శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం వజ్జ వెంకటరావు మాట్లాడుతూ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు యోగా, అథ్లెటిక్స్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల వయసున్న బాలబాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ డోల తిరుపతి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కర్రి రాఘేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక మెంతిపేటలోని సత్యసాయి మందిరంలో చిన్నారులకు బాలవికాస్ వేసవి క్రీడాశిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ తరగతుల్లో మానవీయతా విలువలు, జీవిత సత్యాలు నేర్పించనున్నామన్నారు.

గొడుగుల వితరణ

రాజాం సిటీ: పట్టణంలోని చిరువ్యాపారులకు వాసవీక్లబ్ మనరాజాం-సారథి సభ్యులు సోమవారం గొడుగులు వితరణ చేశారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, ఉపశమనం కోసం తమవంతు సాయంగా దాదాపు 85 మందికి వీటిని అందించామని అధ్యక్షుడు గ్రంథి రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అంబరీస్, చంటిబాబు, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి, త్రైత సిద్ధాంతం గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు రామినాయుడు, రాజు, సత్యం, అప్పలరాజు, రామలింగం, పద్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భక్తులనుద్దేశించి, మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. సోమవారం రేగిడి గ్రామంలోని విశ్వసాయి మందిరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలియుగంలో ప్రతీ మనిషి కాంత, కాంచనాలకు లోనవుతుంటారని, ఎవరైతే వాటికి బద్దులు కాకుండా ఆదర్శంగా ఎవరు జీవిస్తారో వారే సమాజంలో వెలుగొందుతారన్నారు. మనిషి మనిషిగా జీవించాలంటే ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ ఎం.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరేపోలమ్మ ఆలయ వార్షికోత్సవం



సరేపోలమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే శంబంగి తదితరులు

బొబ్బిలి: మండలంలోని జగన్నాధపురంలో సరేపోలమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వేళ సర్పంచ్ బొద్దల పద్మా సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దలు రౌతురామమూర్తి నాయుడు, ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు, ఈశ్వరరావు ఆధ్వర్యంలో వార్షికోత్సవ సంబరాలు జరిగాయి.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరమణికంఠ స్వామి(పుట్టలో వెలసిన అయ్యప్పస్వామి) ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజి పర్యవేక్షణలో పురోహితులు పులఖండం కృష్ణమూర్తిశాస్త్రి, అరవెల్లి రాంబాబుశాస్త్రి నేతృత్వంలో జరిగిన పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 200 మంది భక్తులు అయ్యప్ప మాలలు వేసి, దైవం పట్ల తమకున్న భక్తి శ్రద్ధలు చాటుకున్నారు.

కార్మిక లోకం వర్ధిల్లాలి..



రేగిడి: సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్మికులు



వంగర: ఎర్రజెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు సూర్యనారాయణ

శ్రమదోపిడీని నిరసిస్తూ ప్రపంచ కార్మికులకు స్ఫూర్తినిస్తూ ఏటా మే 1వ తేదీన మే డే కార్యక్రమం నిర్వహిస్తారు. సోమవారం బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని, కార్మిక హక్కులు, సంక్షేమంపై గళంవిప్పారు. కార్మిక లోకం జిందాబాద్, శ్రమజీవుడా నీకు సలాం.. అని నినాదాలు చేశారు. సమాజ గతి, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమేనని, పనికి తగ్గ వేతనం, వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యమివ్వడమే మనమిచ్చే నిజమైన గౌరవమన్నారు. అనంతరం ఎర్రజెండా ఆవిష్కరించి, కార్మికుల శ్రేయస్సు కోసం చేసే పోరాటంలో అశువులు బాసిన వారికి ఘనంగా నివాళులర్పించారు.

– సాక్షినెట్‌వర్క్



రాజాం సిటీ: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు



రాజాం సిటీ: పీహెచ్‌సీ సిబ్బందిని సత్కరిస్తున్న వైద్యాధికారి భార్గవ్



బొబ్బిలిలో జరిగిన కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ హమాలీలు



బొబ్బిలి: పట్టణ కలాసీ సంఘ ఆధ్వర్యంలో కార్మికుల నృత్య ప్రదర్శన



బాడంగి: కార్మిక విప్లవ జెండాను ఎగురవేసి, నినాదాలు చేస్తున్న మహిళా కార్మికులు



మెంటాడ: జెండా వందనం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాకోటి తదితరులు